

బదిలీలకు రంగం సిద్ధం!

కలెక్టర్లు, ఎస్పీలతో పాటు పలు శాఖల ఉద్యోగులకు

త్వరలోనే స్థానచలనం

- రేపోమాపో ఉత్తర్వులిచ్చేలా ప్రభుత్వ కసరత్తు
- ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లు సొంత జిల్లాలకు
- పోలీసు శాఖలో పాత స్థానాలకు వచ్చేందుకు పలువురి ప్రయత్నాలు
- పోస్టింగుల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లా అధికారుల పనితీరుపై నివేదికలు తెప్పించుకున్న సర్కారు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల బదిలీలపై దృష్టి పెట్టింది. చాలా చోట్ల గత ప్రభుత్వం నియమించిన కలెక్టర్లు, ఎస్పీలు సహ కిందిస్థాయి అధికారులు ఉండటం.. అలాగే ఎన్నికల సంఘం నియమించిన వారు ఉండటంతో.. పరిపాలనలో ఆశించిన స్థాయిలో సహకారం లభించటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు కొందరు తమకు అనుకూలురైన అధికారులను నియమించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్నతాధికారులతో పాటు తహసీల్దార్లు, వైద్యులు, పోలీసు అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. త్వరలోనే వారికి స్థానచలనాలు ఉంటాయన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నేడోరేపో ఉత్తర్వులు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో మంచి పోస్టు కోసం కొందరు అధికారులు ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

బదిలీలకు కసరత్తు..

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడటంతో పాటు ఎన్నికల కోడ్ కూడా ముగియడంతో ప్రభుత్వం ఇక పరిపాలనను పరుగులు పెట్టించేందుకు కసరత్తు చేస్తోంది. దీర్ఘకాలంగా జిల్లాల్లో పని చేస్తున్న అధికారులపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వం నియమించిన కలెక్టర్లు, ఎస్పీలతో పాటు ఇతర ఉన్నతాధికారుల పనితీరుపై ప్రభుత్వం నివేదికలు తెప్పించుకుంటోంది. దీనికి తోడు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు గత ప్రభుత్వంలో నియమించిన అధికారులను తొలగించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నా రు. దీంతో అన్ని శాఖల్లో ఏళ్ల తరబడి తిష్ట వేసిన అధికారులతో పాటు ఎన్నికల కోసం వివిధ జిల్లాల నుంచి వచ్చిన అధికారులకు బదిలీలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కిందిస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తోంది. ప్రధానంగా ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన అధికారుల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి పంపినట్టు సమాచారం. కలెక్టరేట్లతో పాటు రెవెన్యూ, వైద్యారోగ్యశాఖ, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమశాఖ, దేవాదాయ శాఖల్లో అధికారులు, సిబ్బంది ఏళ్ల తరబడి బదిలీలు లేకుండా ఒకే చోట పని చేస్తుండగా.. అలాంటి వారి చరిత్ర మొత్తం ప్రభుత్వం సేకరించింది. అలాగే ఎన్నికల నిబంధనల ప్రకారం మూడేళ్లకు పైగా ఒకే జిల్లాలో పని చేస్తున్నవారిని, సొంత జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేశారు. చాల మంది ఉమ్మడి వరంగల్ జిల్లాలో అటు ఇటుగా బదిలీ కావటంతో పాటు కొంతమంది ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు కూడా అధికారులు బదిలీ అయ్యారు. వీరందరిని కూడా సొంత జిల్లాలకు బదిలీ చేయటంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

ఉన్నతాధికారులకూ స్థానచలనం?

కొత్త ప్రభుత్వం పరిపాలనపై దృష్టి పెట్టడంతో బదిలీలకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రధానంగా సుదీర్ఘకాలంగా పని చేస్తున్న ఉన్నతాధికారులపై బదిలీ వేటు పడే అవకాశాలు ఉన్నాయి. 2021 అక్టోబరు 24న భూపాలపల్లి కలెక్టర్‌గా భవేశ్‌మిశ్రా బాధ్యతలు స్వీకరించగా.. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు నిర్దేశించిన పనుల న్నీ విజయవంతం చేయడంతో అప్పటి వరకు ములుగు అదనపు కలెక్టర్‌గా ఉన్న భవేశ్‌మిశ్రా సతీమణి ఇలా త్రిపాఠికి పదోన్నతి కల్పించి ఆమెను ములుగు కలెక్టర్‌గా జూలైలో నియమించారు. అంతేకాకుండా భూపాలపల్లి జిల్లాలో 107 ఎకరాల ప్రభుత్వ భూమిని గులాబీ నేతలు మాయం చేసేందుకు చేసిన ప్రయత్నాలకు రెవెన్యూ అధికారులు పూర్తిగా సహకరించారని ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి. ఈ నేపథ్యంలో భూపాలపల్లి, ములుగు కలెక్టర్లకు ఈసారి బదిలీ తప్పదనే చర్చ జరుగుతుంది. అలాగే భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే భూపాలపల్లి జిల్లాకు గతేడాది అక్టోబరులో వచ్చారు. అయితే భూపాలపల్లి ఎస్పీ పోస్టు కోసం పలువురు ఐపీఎస్‌లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎస్పీ కూడా బదిలీల జాబితాలో ఉన్నట్టు సమాచారం. జనగామ పౌరసరఫరాల శాఖ అధికారిణి రోజారాణి సుదీర్ఘకాలంగా పని చేస్తుండగా బదిలీల్లో ఆమెకు కూడా స్థానచలనం తప్పదనే చర్చ జరుగుతోంది. మహబూబాబాద్ ఎస్పీ రామనాథ్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఎన్నికల బదిలీల్లో భాగంగా మహబూబాబాద్‌కు వచ్చారు. వీరిలో ఎస్పీ పోస్టు కోసం రాజకీయ ప్రయత్నాలు

మిగతా 7వ పేజీలో..

ఉద్యోగులకూ బదిలీలే..

గత అసెంబ్లీ ఎన్నికల ముందు, పార్లమెంట్ ఎన్నికల ముందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీగా బదిలీలు జరిగాయి. ముఖ్యంగా 62మందికి పైగా తహసీల్దార్లు ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. మరికొందరు భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు కూడా వెళ్లారు. ప్రస్తుతం ఎన్నికల తతంగం పూర్తి కావటంతో సొంత ప్రాంతాలకు బదిలీ కోసం తహసీల్దార్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రెండుమూడు రోజుల్లో తహసీల్దార్ల బదిలీలపై ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు సమాచారం. అలాగే వైద్య, ఆరోగ్యశాఖలో ఉమ్మడి వరంగల్‌లోని అన్ని జిల్లాలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోలే పని చేస్తున్నారు. వీరిలో చాలా మంది ఏళ్ల తరబడి జిల్లాలోనే పాతుకపోయారన్న చర్చ ఉంది. ఇక వైద్య, ఆరోగ్య శాఖలోనూ భారీగా బదిలీలు ఉండబోతున్నాయని, అలాగే రిజిస్ట్రేషన్ శాఖలో ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారని, అందులో భాగంగా సబ్‌రిజిస్ట్రార్లకు స్థానచలనం కలగబోతోందన్న చర్చ మొదలైంది. వీటితో పాటు వ్యవసాయ, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో బదిలీలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ఆగస్టు నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ లోపుగానే బదిలీల ప్రక్రియను పూర్తి చేసేలా ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసినట్టు సమాచారం.



యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీకి ఏర్పాట్లు పూర్తి

- అభ్యర్థుల కోసం ఆర్టీసీ బస్సుల ఏర్పాటు
- 11 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణకు సర్వం సిద్ధం
- యూపీఎస్సీ ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్ హరిహర్ రథ్



మాట్లాడుతున్న హరిహర్ రథ్

హనుమకొండ కలెక్టరేట్, జూన్13: యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యూపీఎస్సీ ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్ హరిహర్ రథ్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం యూపీఎస్సీ పరీక్ష సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరిహర్ రథ్ మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన జరిగే యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు హనుమకొండ జిల్లాలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 4,730 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం టీజీఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌లో ఉన్న నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్ తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని తెలిపారు. పరీక్ష ఉదయం 9:30గంటలకు ప్రారంభమై 11:30గంటల వరకు పూర్తి అవుతుందని, అభ్యర్థులను ఉదయం 9గంటల నుంచే పరీక్షా హాల్‌లోని అనుమతిస్తామన్నారు. అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులను మధ్యాహ్నం 2గంటల నుంచి పరీక్షాహాల్‌లోకి అనుమతిస్తామన్నారు. పరీక్ష హాల్‌లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్ లాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదన్నారు. అభ్యర్థులను పరీక్ష హాల్ గేటు వద్ద ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, ముగ్గురు పురుష కానిస్టేబుళ్లు తనిఖీ చేస్తారని, అలాగే మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మెడికల్ ఎమర్జెన్సీ సదుపాయాలు ఉంటాయని, పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, కాజీపేట డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ రవీందర్, ఆర్టీసీ డీఎం ధరంసింగ్ పాల్గొన్నారు.

కొనసాగిన 'డబుల్' లబ్ధిదారుల ఆందోళన

రెండోరోజు వంటావార్పుతో నిరసన



డబుల్ బెడ్‌రూంల వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

భూపాలపల్లిటౌన్, జూన్ 13 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భాస్కర్‌గడ్డ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద లబ్ధిదారుల ఆందోళన గురువారం కూడా కొనసాగింది. రెండో రోజు సుమారు 50 మంది లబ్ధిదారులు అక్కడ వంటావార్పు చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారులు తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించారని, ఇంటి నెంబర్లు కూడా అలాట్ చేశారని తెలిపారు. ఆరు నెలలు గడిచినా ఆ ఇళ్లను ఇప్పటి వరకు అప్పగించలేదన్నారు. దీంతో తమకు ఇళ్లు దక్కుతాయోలేదోనని ఆందోళన నెలకొందన్నారు. ఈ క్రమంలో తాము పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించామని, వారు ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. తమకు ఇళ్లు అప్పగించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకున్నారు. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మునిసిపల్ అధికారులను వివరణ కోరగా డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి అధికారికంగా ఎలాంటి ప్రొసీడింగ్స్ తాము ఇవ్వలేదని తెలిపారు. ఇళ్లను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

అడవి పందిని వేటాడిన వ్యక్తి అరెస్టు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు

ములుగు, జూన్ 13: అడవి పందిని వేటాడిన వ్యక్తిని ములుగు పోలీసులు అరెస్టు చేశారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు రేంజ్ అధికారి శంకర్ ములుగు మండలం బరిగలానిపల్లె శివారు ప్రాంతానికి వెళ్లి చూడగా మృతి చెందిన పంది సహా బత్తుల రాజు అనే వ్యక్తి కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా బైండింగ్ వైర్‌తో కరెంటు ఉచ్చు అమర్చి పందిని హతమార్చినట్లు ఒప్పుకున్నాడు. పశువైద్యుల సమక్షంలో పంది కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసిన అధికారులు రాజుపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు.

'కాళేశ్వరం' నిర్మాణ అవినీతిపై నిగ్గు తేల్చాలి

ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వసుకుల మట్టయ్య



మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏఐకేఎఫ్ నాయకులు

మహదేవపూర్ రూరల్, జూన్ 13 : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై నిగ్గు తేల్చాలని అఖిలభారత రైతు సమైక్య(ఏఐకేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వసుకుల మట్టయ్య డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని ఏఐకేఎఫ్, ఏఐడబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు గురువారం సందర్శించారు. ఈసందర్భంగా మట్టయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అని గొప్పలు చెప్పుకున్న గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాసులకు కక్కుర్తి పడి నిర్మాణ సంస్థలతో కుమ్మక్కై వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో అవినీతి జరిగిందనడానికి పగుళ్లు తేలిన పిల్లరే నిదర్శనమని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో తలెత్తిన పరిస్థితే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ ఉందని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కనీసం ఒక్క ఎకరానికి కూడా నీరందించలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా నాణ్యత లోపాలను సవరించి రైతాంగానికి సాగు, తాగునీరందించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పేరిట నిధులు ఖర్చు చేసి నిరుపయోగంగా మార్చిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ సర్కారుకు పడుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐఏడబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకుడు గోనె కుమారస్వామి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి గుండెబోయిన చంద్రయ్య, రాష్ట్ర నాయకులు నాగెల్లి కొమురయ్య, కుసుంబ బాబురావు, మహ్మద్ ఇస్మాయిల్, సింగతి మల్లికార్జున్, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వసుకుల సైదక్క తదితరులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు శాశ్వత ప్రణాళిక

- వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి
- నిత్యావసరాలు, మందులను నిల్వ చేసుకోవాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- ములుగులో జిల్లా అధికారులతో సమీక్ష

ములుగు, జూన్ 13: వరద ముంపు నివారణకు శాశ్వత ప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. గత ఏడాది వర్షాలు, వరదలతో జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎలాంటి కష్టాలు పడ్డారో ప్రత్యక్షంగా చూశామని, ఆ పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి నేతృత్వంలో కలెక్టరేట్‌లో జిల్లా అధికార యంత్రాంగంతో మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ముంపు నివారణ, అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. ఇప్పటికే వరద ముంపు ప్రాంతాల్లో సర్వే చేపట్టి అధికారులు సమర్పించిన నివేదికను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ఇలా త్రిపాఠి వివరించారు. సమస్యాత్మక ప్రాంతాలను ఎల్లో, ఆరెంజ్, రెడ్ జోన్లుగా విభజించి ముందస్తు చర్యలు చేపడుతామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా క్షేత్రస్థాయిలో కృషిచేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో వరదల నివారణ కోసం పనిచేయాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో అధికారులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. వరద నీరు నిల్వలేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని కోరారు. వానాకాలంలో వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వైద్యశాఖ అధికారులు పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకొని పారిశుధ్య చర్యలు చేపట్టాలని అన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు సరిపడా నిత్యావసరాలు, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను అసంపూర్తిగా వదిలేయడం, జాప్యం చేయడం లాంటి చర్యలకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో ఫీవర్ సర్వే నిర్వహిస్తామని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూస్తామన్నారు. వరదలు, వ్యాధుల నివారణ పర్యవేక్షణ కోసం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతే, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, హెల్త్, ఎన్‌పీడీసీఎల్, ఆర్అండ్‌బీ జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



ఎరువుల గోదామును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మోడల్ బస్టాండు నిర్మాణానికి చర్యలు

సమీక్షా సమావేశం అనంతరం ములుగు ఆర్టీసీ బస్టాండు, పక్కనే ఉన్న పాలశీతలీకరణ కేంద్రం ఖాళీ స్థలాన్ని మంత్రి సీతక్క పరిశీలించారు. మోడల్ బస్టాండు నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. బస్టాండు స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వేచేసి నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠికి సూచించారు. అనంతరం ఇంచర్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.33లక్షల వ్యయంతో నిర్మించిన ఎరువుల నిల్వ గోదామును మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- రెండు బైకులు ఢీకొని రోడ్డుపై పడిన ఇద్దరు
- వారిపై నుంచి వెళ్లిన ఇసుక ట్రాక్టర్ వెళ్లడంతో దుర్మరణం
- గాయపడిన మరో ఇద్దరు ఆసుపత్రికి తరలింపు
- ఆందోళనకు దిగిన మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు



ప్రమాద స్థలంలో రాజయ్య మృతదేహం



రాజయ్య(ఫైల్)



బాపు(ఫైల్)

కాటారం, జూన్ 13 : భూపాలపల్లిలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూతురు పెళ్లి ఉండంతో ఇంట్లో, సాగు సీజన్ మొదలవడంతో వ్యవసాయ పనిముట్లకు మరమ్మతులు చేయించేందుకు ఇంటి యజమాని వడ్రంగిని తీసుకొస్తుండగా... ప్రమాదం బైకు, ఇసుక ట్రాక్టర్ రూపంలో దూసుకొచ్చింది. తొలుత రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడగా అప్పుడే అటుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ వారిపై నుంచి వెళ్లడంతో వారు దుర్మరణం పాలయ్యారు. ఈ విషాద సంఘటన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని విలాసాగర్, దుబ్బపల్లి గ్రామాల మధ్య గురువారం జరిగింది. కాటారం ఎస్ఐ మ్యాక అభినవ్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. విలాసాగర్ గ్రామానికి చెందిన కాపరబోయిన రాజయ్య(48), మల్లేశ్వరి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండగా ఇటీవల కుమార్తె వివాహం నిశ్చయమైంది. ఆ వివాహ పనులతో పాటు.. వ్యవసాయ పనులకు అవసరమయ్యే అచ్చునాగలికి మరమ్మతు చేయడానికి వడ్రంగిని తీసుకురావడానికి రాజయ్య బైక్‌పై దామెరకుంట వెళ్లి ఐలాపురం బాపు(49) అనే వడ్రంగిని తీసుకుని ఇంటికి తిరిగొస్తున్నారు. అదే సమయంలో మల్హర్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఊరుగొండ శ్రీనివాస్ బైక్‌పై భార్య, కూతురుతో కలిసి ఉట్లపల్లి పోచమ్మ తల్లి దగ్గరికి వెళ్తున్నారు. విలాసాగర్, దుబ్బపల్లి గ్రామాల మధ్యలోని చర్చి సమీపంలో శ్రీనివాస్, రాజయ్య బైకులు ఢీ కొన్నాయి. దీంతో రాజయ్య, బాపు ఎగిరి రోడ్డుపై ఓ వైపు.. శ్రీనివాస్, అతడి భార్య, కూతురు మరో వైపు పడిపోయారు. ఆ సరిగ్గా అదే సమయంలో వేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ రోడ్డుపై పడిపోయిన రాజయ్య, బాపులపై నుంచి దూసుకెళ్లింది. దీంతో రాజయ్య తల పగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బాపుకు తీవ్రగాయాలవడంతో స్థానికులు అంబులెన్స్‌లో భూపాలపల్లి 100పడకల ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ప్రమాదంలో మరో వైపు పడిపోయిన శ్రీనివాస్, భార్య, కూతురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అయితే తమవారి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ రాజయ్య, బాపు కుటుంబాల సభ్యులు, బంధువులు, వారి గ్రామాల వారు ఘటన స్థలం వద్ద ఆందోళనకు దిగారు. దాంతో అప్పటికే అక్కడకు చేరుకున్న కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్ఐ అభినవ్ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పి ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. మృతుడు రాజయ్య భార్య ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ ఆంజనేయులు, బైక్ యజమాని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ అభినవ్ తెలిపారు. కాగా మృతుడు బాపు భార్య గతంలోనే పాముకాటుతో చనిపోగా ఆయనకు కుమారుడున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



అనసూర్య(ఫైల్)

మడికొండ, జూన్ 13: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మడికొండకు చెందిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రాజబాబు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హిల్స్ కాలనీకి చెందిన వరికుప్పల అనసూర్య భర్త మల్లేష్ 15 ఏళ్ల కిందట చనిపోయాడు. ఆరోజు నుంచి అనసూర్య తన తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. తరచూ ఆనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. అనారోగ్య సమస్యలు తట్టుకోలేక అనసూర్య బుధవారం ఇల్లు క్లీనింగ్‌కు ఉపయోగించే యాసిడ్ తాగింది. గమనించిన తల్లి యాదమ్మ వెంటనే కుటుంబసభ్యులతో కలిసి ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేయూ ఫిజిక్స్ హెడ్‌గా డాక్టర్ మంజుల

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 13: కేయూ భౌతిక శాస్త్రం విభాగాధిపతిగా డాక్టర్ జి.మంజుల గురువారం బాధ్యతలు స్వీకరిం చారు. సీజే. శ్రీలత నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విభాగపు బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మంజుాల

విద్యుత్ ఫిర్యాదులకు ప్రత్యేక ఫోన్ నెంబర్లు

హనుమకొండ టౌన్, జూన్13: విద్యుత్ సమస్యలు చోటు చేసుకున్నప్పుడు వినియోగదారులు విద్యుత్ శాఖను సంప్రదించేందుకు హనుమకొండ, వరంగల్ డివిజన్ పరిధిలో సెక్షన్‌ల వారీగా ప్రత్యేకంగా ఫోన్‌నెంబర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డీఈలు జి.సాంబరెడ్డి, శంకేసి మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్‌తో పాటు ఆయా సెక్షన్‌ల ఏఈ నెంబర్ల ను విడుదల చేశామని, విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు ఆయా నెంబర్స్‌ను సంప్రదించాలన్నారు.

వరంగల్ పరిధిలో..

సెక్షన్	ఫ్యూజ్ ఆఫ్ కాల్	ఏఈ నెంబర్
మట్టెవాడ	9491075009	9440811349
పోచమ్మమైదాన్	9491075013	94408811348
దేశాయిపేట	8332989176	9491058647
ఆరెపల్లి	9491075045	7901628355
ఏజే మిల్స్	9491075008	9440811352
ఫోర్ట్‌రోడ్డు	9494859759	7901628356
స్టేషన్‌రోడ్డు	9493545861	9440811350
గొర్రెకుంట	9491075007	9440811353
శంభునిపేట	9441384231	8333923910
కరీమాబాద్	9493545868	9440811351
మామునూర్	9491075047	9440811355

హనుమకొండ పరిధిలో..

సెక్షన్	ఏఈ ఫోన్ నెంబర్	ఫ్యూజ్ ఆఫ్ కాల్
గోపాల్‌పూర్	9491058646	9491074615
నయింనగర్	9440811344	9491075001
యాదవనగర్	8333823913	9492461893
నక్కలగుట్ట	9440811346	9491074613
సుబేదారి	9440811347	8331011383
చౌరస్తా	9440811343	9491075002
మచిలీబజార్	9490614531	87002461605
నిట్	9440811345	9491075003
కాజీపేట	8333923912	9491075005
వడ్డేపల్లి	8333923916	9492461801
మడికొండ	9440811354	9491075044
కడిపికొండ	7901624851	-----------

బిర్యాని తిని అస్వస్థత

కాజీపేట, జూన్ 13: కాజీపేటలో ఓ హోటల్‌లో కొంతమంది బిర్యాని తిని అస్వస్థతకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. వివిధ ప్రాంతాల నుంచి కాజీపేటలో కూలీపని చేసేందుకు వచ్చిన ఐదుగురు చౌరస్తాలోని ఓ బిర్యాని సెంటర్‌లో బిర్యాని తిన్నారు. అనంతరం వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో బిర్యాని తిన్న ఐదుగురు హోటల్‌కు వచ్చి యజమానితో ఘర్షణకు దిగారని తెలిసింది. సదరు హోటల్ యజమాని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో కూలీలు తిరిగి వెళ్లినట్టు సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

వడ్డెపల్లి, జూన్ 13: ప్రభుత్వం మైనారిటీల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మైనారిటీల సంక్షేమ శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా (హనుమకొండ) నుంచి అర్హులైన 100 మంది మైనారిటీల అభ్యర్థులకు గ్రూప్-2, గ్రూప్ -3 సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్శీయులు ఈ శిక్షణ కోసం అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 22 వరకు దరఖాస్తులను చేసుకోవాలని పేర్కొన్నారు. 45 రోజుల పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు హనుమకొండ జిల్లా సుబేదారిలోని ఐడీవోసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్ రూమ్ నంబర్ ఎస్-9లో లేదా సెల్ నంబర్ : 73309 90322లో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు ఐసెట్ ఫలితాలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 13: టీజీ ఐసెట్-2024 ఫలితాలను శుక్రవారం విడుదల చేస్తున్నట్లు ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి చేతుల మీదుగా ఫలితాలను మధ్యాహ్నం 3.30 గంటలకు విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వాకాటి కరుణ, ఉన్నత విద్య కౌన్సిల్ వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ వి.వెంకటరమణ, ప్రొఫెసర్ ఎస్కే. మహమూద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఫలితాలు https://icet.tsche.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాల దరఖాస్తుల కోసం గడువును ఈ నెల 14 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఓపెన్ ఇంటర్, టెన్త్ ఫలితాల వెల్లడి

తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితా లు వెల్లడయ్యాయి. ఈ ఫలితాల్లో హనుమకొండ జిల్లాలో టెన్త్ 47.4 శా తం, ఇంటర్ 63.53 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో డాక్టర్ అబ్దుల్‌హై, కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు తెలిపారు.

అలాగే వరంగల్‌లో టెన్త్ 50.78 శాతం, ఇంటర్ 50.26 శాతం, మహబూబాబాద్‌లో టెన్త్‌లో 44.14, ఇంటర్ 44.58, జయశంకర్ భూపాలపల్లిలో టెన్త్ 10.44. ఇంటర్ 47.28, ములుగులో టెన్త్ 67.34, ఇంటర్ 60.82, జనగామ జిల్లాలో టెన్త్ 86.42 శాతం, ఇంటర్‌లో 76.27 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు వారు పేర్కొన్నారు.

బల్దియాలో బదిలీల గుబులు

● ఏళ్ల తరబడి పాతుకుపోయిన సిబ్బంది ● స్థానచలనానికి జాబితా సిద్ధం చేస్తున్న కమిషనర్



వరంగల్ కార్పొరేషన్, జూన్ 13: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ (బల్దియా)లో బదిలీల గుబులు షురువైంది. భారత ఎన్నికల సంఘం ఈ నెల 5న ఎన్నికల కోడ్ ఎత్తేయడంతో బల్దియాలో బదిలీలకు రంగం సిద్ధమైంది. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, శానిటేషన్, ట్యాక్సీ విభాగం, అకౌంట్స్, పరిపాలనా విభాగం, హార్టికల్చర్ వింగ్‌లలో పని చేస్తున్న ఉద్యోగులకు బదిలీలు తప్పదనే వాదనలు వినిపిస్తున్నారు. ముఖ్యంగా చాలా రోజులుగా వివిధ విభాగాల్లో పాతుకుపోయిన వింగ్ అధికారులు, కిందిస్థాయి ఉద్యోగులకు స్థానచలనం కల్పించే యోచనలో బల్దియా ఉన్నతాధికారులు ఉన్నారు. గ్రేటర్ వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాల్లో పనే చేసే సిబ్బందికి కూడా బదిలీలు జరుగుతుండడంతో అంతర్మథనం చెందుతున్నారు.

జాబితా సిద్ధం

బల్దియాలో మూడేళ్లకు మించి పనిచేస్తున్న వారితో పాటు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లి తిరిగి డిప్యూటేషన్‌పై వచ్చి పని చేస్తున్న వారిని గుర్తించిన కమిషనర్, పాలక మండలి సభ్యులు బదిలీ చేయాలని ఆలోచన చేస్తున్నారు. ఈ మేరకు జాబితా సిద్ధం చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. బల్దియాలో పని చేస్తున్న కొందరు అధికారులు ఉద్యోగంలో చేరిన ఆది నుంచి ప్రస్తుతం ఉన్నత స్థాయి అధికారి హోదా వరకు ఇక్కడే పని చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగంలో కొందరు సిబ్బంది చాలా కాలంగా బదిలీ అయినా వెళ్లకుండా ఇక్కడే భీష్మించుకు కూర్చున్నారు. కొందరు ఆర్‌ఐలు, బీఐలు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఎస్‌ఐలు, సూపరింటెండెంట్లు, క్లర్కులు ఆయా శాఖను పట్టుకుని విడవకుండా పాతుకుపోయారు. అయితే కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి పాతుకుపోయిన వారి జాబితా తెప్పించుకున్నట్టు తెలిసింది. కొన్ని విభాగాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీసీలను సైతం గుర్తించి బదిలీ చేసే ప్రక్షాళన దిశలో కమిషనర్ అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది.

ఇంజనీరింగ్ విభాగంలో..

ఇంజనీరింగ్ విభాగంలో ఏడుగురు ఏఈలు ఉద్యోగంలో చేరి 7 ఏళ్లు గడుస్తున్నా వారికి బదిలీలు లేవు. అంతే కాకుండా డీబీ, ఐటీ సెక్షన్‌లో 14 యేండ్లుగా కొందరికి బదిలీలు లేవు. అంతే కాకుండా టౌన్‌ప్లానింగ్‌లో కొందరు టీపీబీవోలు, ఏసీపీలు, ఆర్‌ఐలు, చైన్‌మెన్లకు బదిలీలు అనే మాటే ఎరగరు. ఇలాంటి అధికారును బదిలీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బదిలీలకు రంగం సిద్ధం!

(5వ పేజీ తరువాయి)

జోరుగా సాగుతున్నాయి. హనుమకొండ కలెక్టర్‌పై పెద్దగా ఆరోపణలు లేకపోయినా ప్రజల్లోకి పెద్దగా వెళ్లటం లేదన్న అభిప్రాయాలున్నాయి. ప్రజాక్షేత్రంలోకి వెళ్లకపోవటంతో క్షేత్రస్థాయిలో జరిగే విషయాలు తెలియటం లేదనే చర్చ జరుగుతోంది. వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు పార్లమెంట్ ఎన్నికల్లో చురుకుగా పని చేశారనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు సమాచారం. ఈసారి బదిలీల్లో వరంగల్ కలెక్టర్‌కు అవకాశం ఉండకపోవచ్చునని, ఒకవేళ బదిలీ చేస్తే కీలక శాఖకు పంపిస్తారనే చర్చ జరుగుతోంది. అలాగే వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా కూడా ఎన్నికల బదిలీల్లో భాగంగానే గతేడాది అక్టోబరులో వరంగల్‌కు బదిలీపై వచ్చారు. అయితే అంబర్ కిషోర్‌కు ముందు పని చేసిన ప్రస్తుత ఐజీ రంగనాథ్‌ను మళ్లీ వరంగల్ సీపీగా తీసుకొచ్చేందుకు కాంగ్రెస్‌లోని ఓ వర్గం నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఓ మంత్రి కూడా ఈ మేరకు హామీ ఇచ్చారని, దీంతో మరోసారి రంగనాథ్ వరంగల్ సీపీ పోస్టింగ్ ఇస్తే అంబర్ కిషోర్‌ఝాకు బదిలీ తప్పకపోవచ్చన్న చర్చ జరుగుతోంది.

సీఐ రాసలీలలు బట్టబయలు!

మహిళతో ఉన్నట్లు ఆధారాలు లభ్యం

ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారణ

సీసీ ఫుటేజీలు సహా సీపీకి నివేదిక అందజేత



వరంగల్ క్రైం, జూన్ 13: రెండు రోజుల క్రితం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ (ఎస్‌ఐబీ)కి చెందిన ఓ సీఐ మద్యం తాగి ఓ మహిళను తానున్న చోటుకు పిలిపించుకుని రాసలీలలకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనపై పూర్తివివరాలు వెలుగులోకి రాకపోయినప్పటికీ.. సదరు సీఐ ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు శతవిధాలా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఒక దశలో రైడింగ్‌కు వచ్చిన ఎస్‌ఐ రాజ్‌కుమార్‌తో సదరు సీఐ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. 'నేను ఒక సీఐని.. అని ఎలా రైడింగ్ చేస్తారు..' అని దబాయించినట్లు తెలిసింది. అయితే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చిన ఎస్‌ఐ రాజ్‌కుమార్.. సీఐతో పాటు మరో ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించారు. సీసీ కెమెరాల ఫుటేజీ సేకరణతో పాటు భవనంలో పనిచేసే వారిని విచారణ చేసి పక్కాగా ఓ నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందించారు.

అసలేం జరిగింది?

సదరు ఎస్‌ఐబీ సీఐ మంగళవారం ముగ్గురు స్నేహితులతో కలిసి కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతగట్టు ప్రాంతంలో కల్లు తాగాడు. ఆ తర్వాత హనుమకొండకు వచ్చి మద్యం తీసుకుని, ఒక మహిళను తీసుకుని చింతగట్టు క్యాంపు సమీపంలోని ఒక భవనంలోకి వచ్చాడు. ముగ్గురు స్నేహితులను ఒక రూములో ఉంచి.. మరో రూములో సీఐ ఆ మహిళతో ఉన్నాడని సమాచారం. ఈ భవనంలో సీఐ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో కేయూ ఎస్‌ఐ రాజ్‌కుమార్ అక్కడికి వెళ్లాడు. అప్పటికే పోలీసులు వస్తున్నట్టు సమాచారం రావడంతో సదరు మహిళను అక్కడి నుంచి తప్పించిన సీఐ.. ఎస్‌ఐతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. దీంతో అదనపు సిబ్బందిని పిలుపించుకున్న ఎస్‌ఐ రాజ్‌కుమార్.. సీఐతో పాటు అతడి ముగ్గురు స్నేహితులు, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారని, ఆ భవనం సీసీ ఫుటేజీని సేకరించి పక్కా ఆధారాలతో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందించినట్లు సమాచారం. ఆ నివేదిక ఆధారంగా సదరు సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది. తప్పు చేయడమే కాకుండా విధినిర్వహణలో ఉన్న ఎస్‌ఐపై దురుసుగా ప్రవర్తించడం, సీసీ ఫుటేజీని కూడా మాయం చేసేందుకు ప్రయత్నం చేశాడన్న ఆరోపణల నేపథ్యంలో ఆ సీఐపై వేటు పడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తంగా సీఐ రాసలీల బాగోతం పోలీస్‌శాఖలో హాట్ టాపిక్‌గా మారగా.. ఈ విషయమై ఎస్‌ఐ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. సీఐపై విచారణ జరిపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

బస్సుల్లో నకిలీ పాస్‌లు

● ఫొటో ఒకరిది.. ప్రయాణం ఒకరు..

● పట్టించుకోని ఉన్నతాధికారులు

బాలసముద్రం, జూన్ 13: వరంగల్ ఆర్టీసీ రీజినల్ పరిధిలో బస్సుల్లో నకిలీ పాస్‌లతో కొందరు ప్రయాణం చేస్తున్నారు. నకిలీ బస్‌పాస్‌లతో బస్సు ప్రయాణం చేస్తూ కండక్టర్లకు పట్టుబడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కొందరు కండక్టర్లు వాపోతున్నారు. దివ్యాంగుల సదరన్ సర్టిఫికెట్ ద్వారా ఆర్టీసీ బస్‌పాస్ సెక్షన్‌లో కొందరు ఇష్టారీతిన పాసులు జారీచేయడంతో పాస్‌లను కొందరు బయటి వ్యక్తులకు అమ్ముకుంటున్నట్లు తేటతెల్లమవుతోంది. నిలదీసిన కండక్టర్లను నకిలీ పాస్‌లు ఉన్నవారు దాడికి పాల్పడుతున్నట్లు కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల కిందట హనుమకొండ నుంచి భూపాలపల్లికి ఒకవ్యక్తి నకిలీ బస్‌పాస్‌తో ప్రయాణం చేస్తుండగా కండక్టర్ పరిశీలించగా ఫొటో ఒకరిది, పేరు ఒకరిది ఉండడంతో అవాక్కయ్యాడు. ఈ నకిలీ బస్ పాస్‌ల వ్యవహారంపై ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు విచారణ జరిపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

18న నిట్‌లో జేఈఈ ప్రవేశాలపై అవగాహన కార్యక్రమం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 13: వరంగల్ నిట్‌లో ఈ నెల 18న జేఈఈ ప్రవేశాలపై ఓపెన్ హౌస్ పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి గురువారం ప్రకటనలో తెలిపారు. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఈఈ ప్రవేశాలకు సంబంధించి అంశాలపై నిష్ణాతులైన ప్రొఫెసర్లు వివరిస్తారని, అలాగే నిట్‌కు సంబంధించిన విశిష్టతను ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వివరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జేఈఈలో అర్హత సాధించిన విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేంద్రమంత్రులను కలిసిన అరూరి రమేశ్



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేశ్

హనుమకొండ టౌన్, జూన్13: కేంద్ర బొగ్గు గనులు, హోంశాఖ సహాయ మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన గంగాపురం కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను గురువారం ఢిల్లీలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అరూరి రమేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రమేశ్ వెంట బీజేపీ నాయకులు చందుపట్ల కీర్తిరెడ్డి, సత్యపాల్‌రెడ్డి ఉన్నారు.

సాగు సంరంభం.. ఆరంభం



ఓ వైపు నైరుతిరుతుపవనాల ఆశాజనకంగా ఉండటంతో అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. దీంతో రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు. మెట్ట పంటలు వేసే రైతులు భూములను దున్ని సాగు సంరంభాన్ని ప్రారంభించారు. పత్తి రైతులైతే విత్తనాలు కూడా వేస్తున్నారు. ఈ ఏడాది వానలు సమృద్ధిగా పడి పంటలు అధిక దిగుబడులు వచ్చి తమ కష్టాలు తీరతాయన్న కోటి ఆశలతో వానాకాలం వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు ఇలా సాగుపనుల్లో బిజీబిజీగా కనిపించారు.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

మార్నేని సన్మానించిన డీసీసీ బ్యాంకుల చైర్మన్లు

హనుమకొండ సిటీ, జూన్ 12: తెలంగాణ రాష్ట్ర కో-ఆప రేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన మార్నేని రవీందర్ రావును తెలంగాణలోని డీసీసీ బ్యాంక్‌ల చైర్మన్లు సన్మానించారు. గురువారం సాయంత్రం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో మార్నేనికి అభినందనలు తెలియచేస్తూ పూలమాలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీయం చంద్రశేఖర్, వరంగల్ డీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎం.డి. నజీర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నాబార్డ్ సీజీఎంను కలిసిన మార్నేని

హైదరాబాద్ నాబార్డ్ ఆఫీసులో సీజీఎం చింతల సుశీ లను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వైస్ చైర్మన్ కొత్తకుర్మా సత్తెయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. చైర్మన్ గా నియమితులైన సందర్భంగా మార్నేనిని సీజీఎం సుశీల అభినందించారు.



మార్నేని రవీందర్‌రావును సన్మానిస్తున్న డీసీసీ బ్యాంక్ చైర్మన్లు

యువకుడి అదృశ్యం



వరుణ్‌కుమార్ (ఫైల్)

హసన్‌పర్తి, జూన్ 13: మండలంలోని సీతంపేటకు చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేటకు చెందిన గడ్డం రాధమ్మ కుమారుడు గడ్డం సదానందం, కోడలు స్వరూప కొన్నేళ్ల కిందట మరణించారు. వీరి కుమారుడు గడ్డం వరుణ్‌కుమార్ (25) తన నానమ్మ గడ్డం రాధమ్మ దగ్గర ఉంటున్నాడు. వరుణ్‌కుమార్ ఈనెల 5న హైదరాబాద్‌లో పని ఉన్నదని, తన స్నేహితుడిని కలవడానికి వెళుతున్నాని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తోంది. వారి బంధుల ఇంట్లో, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియడంలేదు. దీంతో గురువారం రాత్రి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో గడ్డం రాధమ్మ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గడ్డం వరుణ్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు 87126 85124 నంబర్‌లో తెలపాలని కోరారు.

కుంగ్‌ఫూలో అడ్లూరు బ్రదర్స్‌కు పతకాలు



అడ్లూరు బ్రదర్స్‌ను అభినందిస్తున్న దృశ్యం

హనుమకొండ,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జరిగిన నేషనల్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో కాజీపేటలోని సెయింట్ గ్యాబ్రియల్స్ హైస్కూల్ విద్యార్థులు అడ్లూరు సుధామ భరద్వాజ్, అడ్లూరు సుధాంశ భరద్వాజ్ బంగారు పతకాలను సాధించినట్లు బ్లాక్‌బెల్ట్ మాస్టర్ విజేందర్ తెలిపారు. ఈ పోటీల్లో సుధామ భరద్వాజ్‌కు 2, సుధాంశ భరద్వాజ్‌కు ఒక పతకం లభించింది. ఈ ఇద్దరిని హైస్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ శివారెడ్డి, ఉపాధ్యాయులు వీరిని అభినందించారు. ఏడోతరగతి చదువుతున్న సుధామ భరద్వాజ్ కుంగ్ ఫూలో పలు కుంగ్ ఫూ పోటీల్లో ఇప్పటివరకు 11 పకతాలను సాధించారు. 4వ తరగతి చదువుతున్న ఈయన తమ్ముడు సుధాంశ భరద్వాజ్ రెండు పతకాలను గెలుచుకున్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన ప్రముఖ రిటైర్డ్ మ్యాథ్స్ లెక్చరర్, గణిత అష్టావధాని డాక్టర్ అడ్లూరు నరసింహమూర్తి మనుమలే ఈ అడ్లూరు బ్రదర్స్.

రామప్ప ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కాంట్రాక్టర్లతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

వెంకటాపూర్(రామప్ప), జూన్ 13: మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో అక్టోబరులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదేశించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సి.హెచ్.మహేందర్‌జీతో కలిసి రామప్ప సరస్సును ఆమె గురువారం సందర్శించారు. నీటినిల్వ సామర్థ్యం, ఆయకట్టు తదితర అంశాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సరస్సు మత్తడిని పరిశీలించి వరదల నేపథ్యంలో అధిక వరదలను ఎలా నియంత్రించాలనే అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రసాద్ స్కీంలో మంజూరైన ఇంటర్ ప్రేటేషన్ సెంటర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రామప్ప దేవాలయం తూర్పు ముఖద్వారం ఎదురుగా పదెకరాల విస్తీర్ణంలో రూ.61.99 కోట్లతో గ్లాస్‌వర్క్‌తో కూడిన ఫుడ్‌కోర్ట్, అలంకారాలతో కూడిన సావనీర్‌స్టాల్స్, మరుగుదొడ్ల బ్లాక్-2, సెక్యూరిటీ క్యాబిన్-2, కాంపౌండ్‌వాల్, అలంకార గేట్లు, పరికరాలతో ఫౌంటేన్ నిర్మాణం, అలంకారంతో వంపు(కాకతీయశైలి), సంప్ నిర్మాణం పనులను అక్టోబరులోగా పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రామప్ప ఆలయ తూర్పు ముఖద్వార ఆర్చ్ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉందన్న చందంగా మారిందని, సుమారు రూ.9కోట్లతో రామప్ప ఆలయం తూర్పు ముఖద్వారం నుంచి ప్రధాన గేటు వరకు 41 సెంట్రల్ లైటింగ్ స్తంభాలను ఏర్పాటు చేసిన వారానికే ఒక్క లైటుకూడా వెలగలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఆలయ తూర్పు భాగాన రూ.10లక్షలతో చేపట్టిన సీసీ డబుల్‌రోడ్డు నిర్మాణం ఒక్క వర్షానికే దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలిగిందని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, వెంటనే రామప్ప ఆలయ అభివృద్ధిలో ఎలాంటి సమస్యలు లేకుండా రానున్న మహాశివరాత్రిలోగా సెంట్రల్ లైటింగ్, డబుల్‌రోడ్డు నిర్మాణం, ఆలయ ప్రధాన ఆర్చ్ నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టిన రామప్ప ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ప్రభుత్వం తరఫున హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. భీంఘణపురం చెరువు నుంచి రామప్ప సరస్సులోకి దేవాదుల పైపులైన్ ద్వారా నీటిని విడుదల చేసి గ్రావిటీ కెనాల్స్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ విజయభాస్కర్‌రావు, ఈడీ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, చెన్నోజు సూర్యనారాయణ, బండి శ్రీనివాస్, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బుర్ర


రామప్ప సరస్సు తూమును పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

రజిత సమ్మయ్య, కూరెళ్ల రామాచారి, మిల్కూరి ఐలయ్య, శ్రీనివాస్, జంగిలి రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన జర్నలిస్టులు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. తమకు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా ఆమె సానుకూలంగా స్పందించారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ములుగు కలెక్టరేట్ : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని రాష్ట్ర పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని బండారుపల్లి ఆదర్శ పాఠశాలలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మంత్రి సీతక్క గురువారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని, ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు ఉచిత వసతితోపాటు కాస్మోటిక్, ఇతర సౌకర్యాలు అందుతున్నాయన్నారు. గ్రామాల్లో ఉండే ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఈవిద్యాసంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియం నర్సరీ విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో 19,645 మంది పిల్లలకు ఒక జత యూనిఫాం దుస్తులను మహిళా సంఘాల ద్వారా కుట్టించామన్నారు. 1,71,150 ఉచిత పాఠ్యపుస్తకాలకు 1,42,510 పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 95,913 ఉచిత నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ 367 పా ఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసి మౌలిక సౌకర్యాల కల్పన కోసం సుమారు రూ.6.91 కోట్ల అభివృద్ధి పనులు చేప ట్టినట్టు తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని 99ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ములుగు ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి, డీఈవో పాణిని, డీఎస్పీ రవీందర్, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఎంఈవోలు పాల్గొన్నారు.

మంత్రికి ఎస్టీయూ నాయకుల వినతి

మోడల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ నేతృత్వంలో నాయకులు మంత్రి ధనసరి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. బదిలీలకు సంబంధించి కోర్టు కేసులను ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని, మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలను 010 పద్దుకింద ఇప్పించాలని కోరారు. బదిలీలతోపాటు పదోన్నతులు కూడా నిర్వహించాలని, ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నచోట అదనపు టీజీటీ పోస్టు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు రుద్రమదేవి, కృష్ణ, రమేష్, మంజుల, అపర్ణ, అనీఫ్, సుధారాణి, శ్రీనివాసచారి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంత్రి ధనసరి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మాదిరిగానే ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖలో ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 5 వేలమంది ఉపాధ్యాయులు గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్నారని, వారి బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రిని కలిసినవారిలో గిరిజన సంక్షేమశాఖ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగాల శ్రీరాములు, ఉపాధ్యక్షుడు ఇరుప సారయ్యదొర, టీఎస్‌యూటీఎఫ్ కార్యదర్శి గొప్ప సమ్మారావు, డీటీఎఫ్ నాయకులు చేరాలు, రాజారత్నం, టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజునాయక్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న, వెంకటాపూర్ మండల జనరల్ సెక్రటరీ బానోత్ రాంకుమార్ తదితరులు ఉన్నారు.

ఆదివాసీల భూములకు రక్షణ కల్పించాలి

ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్

వెంకటాపురం(నూగూరు), జూన్ 13: ఆదివాసీల సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పిం చాలని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొమరంభీం కాలనీ ఆదివాసీల భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని కోరుతూ గోండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈదీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపిన భిక్షపతిగౌడ్ మాట్లాడారు. ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ విధానాలు అమలు చేస్తున్నాయని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు పూనెం సాయి, ప్రతాప్, సూర్యం, రాజేష్, మనోజ్, నూనె శ్రీనివాస్, నర్సింహారావు పాల్గొన్నారు.

వయోపరిమితి పెంపు ఏఐటీయూసీ ఘనతే

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

కాకతీయఖని, జూన్ 13: సింగరేణి డిపెండెంట్ వయోప రిమితి పెంపు ఏఐటీయూసీ ఘనతేనని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. భూపాలపల్లి ఏరి యాలోని కేటీకే-1వ, 5వ గని ఆవరణలో గురువారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలకు ముందు మెనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అన్ని హామీలను అమలు పరిచేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో ఏరియా బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్, నాయకులు ఆసిఫ్‌పాషా, తిరుపతి, శ్రీనివాస్, రాజుమహ్మద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన

వాజేడు, జూన్ 13: బాలల పరిరక్షణపై కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పేరూరులో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో ముత్తమ్మ మాట్లాడుతూ బాల్యంలోనే పెళ్లిళ్ల చేయొద్దని సూచించారు. బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఐదేళ్లు నిండిన బాల, బాలికలను బడికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాల కోఆర్డినేటర్లు కామేష్, హనుమంతు, యానిమేటర్లు ప్రసాద్, స్వరూప, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

వాజేడు, జూన్ 13: మండ లంలోని ధర్మవరం క్వారీ నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న ఇసుక లారీలను చింతూరు గ్రామస్థులు గురువారం అడ్డుకు న్నారు. రోడ్డుపై బైఠాయించి లారీలు వెళ్లకుండా ఆపారు. ఇసుక లారీల కారణంగా రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని, దీంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. ఈ ఇసుక లారీలతో తమ గ్రామానికి ఎలాంటి లబ్ధి చేకూరకపోవడమే కాకుండా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. గ్రామస్థులు ఆందోళనకు దిగారని తెలుసుకున్న చింతూరు మాజీ సర్పంచ్ బుల్లెశ్వరరావు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

చికిత్స పొందుతూ 'ఉపాధి' కూలీ మృతి


సరోజన (ఫైల్)

చిట్యాల, జూన్ 13: ఉపాదిహామీ పనులకు వెళ్లి అస్వస్థతకు గురైన మహిళా కూలీ గోల్కొండ సరోజన (57) చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన సరోజన భర్త సారయ్యతో కలిసి ఈనెల 5న గ్రామ శివారులోని పెద్దచెరువులో ఉపాధి హామీ పనులకు వెళ్లింది. ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో సరోజన మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఇంటి రుణంపై వడ్డీ చెల్లింపు ఆంక్షలు ఎత్తివేత

కాకతీయఖని, జూన్ 13: సింగరేణిలో కార్మికుల ఇంటి రుణంపై వడ్డీ చెల్లింపుపై గతంలో ఉన్న ఆంక్షలను యాజమాన్యం ఎత్తి వేసిందని, ఈ మేరకు సర్క్యులర్‌ను గురువారం జారీ చేసిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు గతంలో ఇంటి నిర్మాణం, కొనుగోలు చేసేందుకు బ్యాంకు నుంచి రుణం తీసుకుంటే సంవత్సరం లోపు మాత్రమే వడ్డీ చెల్లించే వారని, సంవత్సరం దాటిన వారికి వడ్డీ చెల్లించలేదని పేర్కొన్నారు. దీంతో ఎంతో మంది కార్మికులు నష్టపోయారని తెలిపారు. 8.33 శాతం కంటే తక్కువ వడ్డీకి రుణం తీసుకున్న వారికి 6 లేదా, 7శాతం చెల్లించారని వివరించారు. కార్మికుల ఈ సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని తెలిపారు.

తునికాకు బోనస్‌ను చెల్లించాలి : సీపీఎం

వెంకటాపురం(నూగూరు), జూన్ 13: పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ డబ్బులను తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండలకేంద్రంలో వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన తునికాకు కార్మికులు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ 2016 నుంచి తునికాకు కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ డబ్బును చెల్లించడంలో అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘుపతి, రాములు, శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలు

ములుగు, జూన్ 13: ములుగు మండలం జంగాలపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇంచర్లకు చెందిన గొట్టిముక్కుల నవీన్ ద్విచక్రవాహనంపై జంగాలపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఏటూరునాగారం వైపు వెళ్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. దీంతో నవీన్ తల, శరీర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వాజేడులో ఒకరికి..

వాజేడు : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గెర్లగుడెంకు చెందిన అర్రెం నరేష్ బైక్‌పై జగన్నాథపురం వైపు వెళ్తా పాయబాట్ల వద్ద ఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. నరేష్ కాలుకు తీవ్ర గాయాలు కాగా అతడిని ఏటూరునా గారంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు.

మేడారంలో భక్తుల సందడి

మేడారం, జూన్ 13 : తాడ్వాయి మం డలం మేడారం గురువారం సందడి నెల కొంది. వనదే వతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, తల్లుల గద్దెల వద్ద పూజలు చేశారు.


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

'గురుకుల విద్యాసంస్థ కోసం అద్దె భవనం కావాలి'

ములుగు కలెక్టరేట్, జూన్ 13: ములుగు పట్టణంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు) ఏర్పాటు కోసం అన్నివసతులతో కూడిన అద్దె భవనం తమకు అవసరమని ములుగు జిల్లా సమన్వయ అధికారి జూలూరు యాదగిరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16 క్లాస్‌రూమ్‌లు, డైనింగ్‌హాల్, ల్యాబ్‌లతో పాటు ఐదోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తర గతులు నిర్వహించడానికి అద్దె భవనం కావాలని, ఆసక్తి ఉన్న యజమానులు పూర్తి వివరాలకు 9704550188 సెల్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


చిట్యాలలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం, జూన్ 13: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 17 మందికి కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఆయన గురువారం చెక్కులు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్‌రావు, ఎంపీడీవో భాస్కర్, నాయకులు సత్యనారాయణరెడ్డి, రాజేందర్, మలహల్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ కుమార్, భువనసుందర్ తదతరులు పాల్గొన్నారు.

- టేకుమట్ల : మండలంలోని రామక్రిష్టాపూర్(టి) గ్రామంలోని ఎమ్మార్సీ భవనంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులు 31 మందికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ విజయ లక్ష్మి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య వంతెన పునఃనిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.
- చిట్యాల : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 80 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంపిణీ చేశారు. ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, జడ్పీటీసీ గొర్రె సాగర్, టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- రేగొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంపిణీ చేశారు. తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీపీ పున్నం లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు. జడ్పీటీసీ సాయిని విజయ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సంపత్‌రావు, నాయకులు మోడెం ఉమేష్‌గౌడ్, గుంటోజు కిష్టయ్య, మేకల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'మావోయిస్టులను కోర్టులో హాజరుపరచాలి'

వెంకటాపురం(నూగూరు), జూన్ 13: తడపల అటవీప్రాంతంలో ఈనెల 12వతేదీన గ్రేహౌండ్స్ పోలీసులు పట్టుకున్న ముగ్గురు మావోయిస్టు సభ్యులు రీతా, మోతీ, ఇడ్మాలతోపాటు పనులరీత్యా అడవికి వచ్చిన మరో ముగ్గురిని 24 గంటల్లోగా కోర్టులో హాజరుపరచాలని మావోయిస్టు వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరున గురువారం సోషల్ మీడియాలో లేఖ వైరల్ అయింది. పట్టుకున్న వారిని ఎన్‌కౌంటర్ పేరుతో చంపేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారని, ఎలాంటి సబంధంలేని అమాయకులను బాంబుల గురించి చెప్పాలంటూ చిత్రహింసలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులు చేస్తున్న అక్రమ అరెస్టులను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని ఆ లేఖలో కోరారు.

మైసమ్మ గుడిని ఢీకొన్న బొగ్గు లారీ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 13: భూపాలపల్లి పట్టణ పరిధి మంజూర్‌నగర్‌లోని మైసమ్మ గుడిని బొగ్గు లారీ గురువారం తెల్లవారుజామున ఢీకొంది. దీంతో గుడి ధ్వంసమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి పరకాల వైపు వెళ్తున్న బొగ్గు లారీ అతివేగంగా వెళ్లి మైసమ్మ దేవాలయాన్ని ముందు భాగం నుంచి ఢీకొంది. దీంతో దేవాలయం వెనకభాగం పూర్తిగా కూలిపోయింది. లారీ డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటన జరిగిన వెంటనే గుడి నిర్వాహకులు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు.

అర్చకుడి ఇంట్లో చోరీ

రేగొండ, జూన్ 13: మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. అర్చకుడు సముద్రాల సురేష్ ఆచార్యుల ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్ ఆచార్యులు కుటుంబంతో కలిసి నల్లగొండ జిల్లా తిరుమలగిరికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడ్డారు. గోడ దూకి పారిపోతుండగా స్థానికులు గమనించి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అయినా చేతికి చిక్కకుండా పరారయ్యారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగలు ఉపయోగించారని అనుమానిస్తున్న ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొంగలు తొమ్మిది తులాల బంగారం, రూ. 5 వేల నగదు అపహరించినట్టు గుర్తించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎౕఐ మల్లేష్ యాదవ్ తెలిపారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ రాష్ట్ర డీఐజీ సిద్ధిఖీ

సంగెం, జూన్ 13: టీఎస్ఎస్‌పీ పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని టీఎస్ఎస్‌పీ బెటాలియన్స్ డీఐజీ ఎంఎస్ సిద్ధిఖీ అన్నారు. మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన సందర్శించారు. బెటాలియన్‌లోని వెల్ఫేర్ గ్రూప్, క్యాటర్ మాస్టర్ గ్రూప్, మోటార్ ట్రాన్స్‌పోర్టు గ్రూప్, పోలీస్ పెట్రోల్ పంపు, ట్రైనింగ్ గ్రూప్, బెటాలియన్ యూనిట్ ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం బెటాలియన్ సిబ్బంది నుంచి సిద్ధిఖీ గౌరవ వందనం స్వీకరించారు. పోలీసుల కవాతును వీక్షించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. బెటాలియన్‌లో కమాండెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన పచ్చదనం, పరిశుభ్రతలను ఆయన పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెట్లు కృష్ణప్రసాద్, వీరన్న, శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, యూనిట్ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అన్వేషిణి, ఆర్ఐలు శోభన్, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.


పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతున్న బెటాలియన్ డీఐజీ సిద్ధిఖీ

ఇంకా తెరుచుకోని పాఠశాలలు


పోలారం పాఠశాలలో క్యారం ఆడుతున్న బయటి వ్యక్తులు

మహాముత్తారం, జూన్13 : వేసవి సెలవులు ముగిసినా మండలంలోని పలు పాఠశాలల్లో గురు వారం తరగతులు జరగలేదు. మారుమూల ఆదివాసీ గ్రామం ఉట్లపల్లి ప్రభుత్వ పాఠశాల తెరుచుకోలేదు. గురువారం దీని తాళాలు తీయలేదు. అదేవిధంగా పోలారం గ్రామంలో ఇద్దరు ఉపాధ్యా యులు ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. తరగతి గదిలో బయటి వ్యక్తులు పలువురు క్యారంబోర్డు ఆడు తూ కన్పించారు. ఈ విషయంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ ఎం సంజీవరెడ్డిని వివరణ కోరగా ఇద్దరు ఉపాధ్యాయులు తనకు సమాచారం ఇవ్వకుండానే జిల్లా కేంద్రానికి వెళ్లారని తెలిపారు. తనకు సమాచారం ఇచ్చి ఉంటే సీఆర్‌టీలతోనైనా పాఠశాల తెరిపించే వాడినని అన్నారు. అలాగే రెడ్డిఎల్లి పాఠశాల ఉపాధ్యాయుడు సమాచారం ఇవ్వకుండానే గైర్హాజరయ్యారు. లింగాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇక్కడ సీఆర్‌టీ విధులు నిర్వర్తిస్తుండగా ఆలస్యంగా పాఠశాలను తెరిచారు.

ఆశా కార్యకర్తల ఆందోళన

ములుగు కలెక్టరేట్, జూన్ 13: ఆశా కార్యకర్తలు ములుగు పట్టణంలోని జాతీయ రహదారిపై గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పరీక్షలు నిర్వహించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనేక పనులు చేస్తూ సీనియారిటీ ఉన్న ఆశాలకు కొత్తగా పరీక్షలు నిర్వహించి శక్తిసామర్థ్యాలను నిరూపించుకోమని ప్రభుత్వం చెప్పడం సమంజసం కాదని అన్నారు. సుమారు గంటపాటు ధర్నా జరగ్గా కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క తమవద్దకు వచ్చి హామీ ఇవ్వాలని ఆశాలు పట్టుబట్టారు. దీంతో డీఎంహెచ్‌వో అప్పయ్య ధర్నా వద్దకు చేరుకుని వారిని మంత్రి సీతక్క వద్దకు తీసుకెళ్లగా డిమాండ్లతో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా నాయకుడు గుండె బోయిన రవిగౌడ్ పాల్గొన్నారు.

భూపాలపల్లి కలెక్టరేట్ వద్ద..

భూపాలపల్లి కలెక్టరేట్ భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కలెక్టర్ భవేష్ మిశ్రాకువినతిపత్రం అందించారు. తమకు నష్టం కలిగించే పరీక్షను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆశాలు రమ, శ్రీలత, సరోజన, రమ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు : డీఆర్డీవో

కాటారం, జూన్ 13: ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో అవకతవకలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో నరేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం అవరణలో ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ మండల స్థాయి ప్రజావేదికను గురువారం నిర్వహించగా రాత్రి వరకు సాగింది. 2023 ఏప్రిల్ 1నుంచి ఈ ఏడాది మార్చి 31వరకు జరిగిన సుమారు రూ.4 కోట్ల నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. తనిఖీల నివేదికలను ప్రజావేదికలో డీఆర్‌పీలు చదివి వినిపించారు. పలు చోట్ల పనుల కొలతల్లో తేడాలు ఉన్నట్లు, నాటిన మొక్కలు అధిక శాతం చనిపోయినట్లు, మస్టర్ రోల్స్‌లో కొట్టివేతలు ఉన్నట్లు తెలిపారు. కూలీలకు వేతనాలు, మస్టర్లలో తేడాలున్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మస్టర్ రోల్స్‌లో కొట్టివేతలు ఉన్నాయని ఆక్షేపించారు. అటవీప్రాంతాల్లో చేసిన పనులు సక్రమంగా లేవని డీఆర్‌పీలు వేదిక దృష్టికితెచ్చారు. రాత్రి 9గంటల వరకు 24జీపీ లకు సంబంధించిన నివేదికలు సమీక్షించగా విజిలెన్స్ అధికారులు వీటిపై పూర్తి స్థాయిలోచర్చించి రికవరీ నివేదికను సిద్ధం చేస్తున్నారు.

మండలవ్యాప్తంగా 24జీపీల్లో ఈజీఎస్ నిధులతో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డు లను అధికా రులు తమ తనిఖీ బృందా లకు ఇవ్వలేదని సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ కొము రయ్య తెలిపారు. సుమారు రూ2కోట్ల నిధులతో చేప ట్టిన సీసీ రోడ్లు, డ్రయినేజీలకు సంబంధించి రికార్డులు, ఎంబీలు ఇవ్వకపోవడంతో సోషల్ ఆడిట్ జరగలేదని ప్రజావేదిక దృష్టికి తీసుకొచ్చారు.

మండలంలో జరిగిన 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా నిర్వహించిన ప్రజా వేది కలో డీఆర్‌పీలు నివేదికల్లో మస్టర్ రోల్స్ సక్రమంగా నిర్వహించకపోవడం, కొలతల్లో తేడాలతో పాటు పలు అంశాలపై ఈజీఎస్ అధికారులు, ఎఫ్ఏలు, కార్యదర్శుల నుంచి డీఆర్‌డీవో రూ.1,65,296 పెనాల్టీ రికవరీకి ఆదేశించారు.

సీఎంను కలిసిన సహకార సంఘం మాజీ చైర్మన్


రేవంత్‌రెడ్డితో శివప్రసాద్

మంగపేట, జూన్, 13: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగపేట సహకార సంఘం మాజీ చైర్మన్, వల్లెపల్లి శివప్రసాద్ గురువారం హైదరాబాద్‌లో కలిశారు. మండలంలో పేరుకు పోయిన పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని శివప్రసాద్ తెలిపారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.